## క్లుప్తంగా

### నిబంధనల మేరకు ఉత్సవాలు నిర్వహించుకోవాలి



కడియంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిశోర్, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తదితరులు

కడియం: రానున్న వినాయక ఉత్సవాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిశోర్ కోరారు. ఈ మేరకు కడియంలోని పోస్టాఫీస్ వీధిలో వినాయక ఉత్సవ కమిటీలకు అవగాహన సమావేశం నిర్వహించారు. కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. విద్యుత్, అగ్ని తదితర ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అలాగే మైక్ తదితర వాటికి అనుమతులను నిర్దేశించిన నిబంధనల మేరకు తీసుకోవాలన్నారు. అశ్లీల, అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించేది లేదన్నారు. ఉత్సవాల ముగింపులో భాగంగా ఊరేగింపు రూట్‌ను ముందుగానే తెలియజేయాలని కోరారు. ఉత్సవ మండపాల వద్ద భద్రతా పరమైన చర్యలకు ఉత్సవ కమిటీలే బాధ్యత వహించి, పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

### బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలి



డీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న బీఎస్పీ నాయకులు

సీటీఆర్ఐ: బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్థానిక కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో డీఆర్వో సీతారామమూర్తికి బీఎస్పీ నాయకుడు పటాన్ల విజయకుమార్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తానని చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా హామీ అమలు జరగలేదన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలు, చట్టసభలు, నామినేటెడ్ పోస్టులు, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కలిప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి శేఖర్, కోటి, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

### సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం అవసరం

రాజమహేంద్రవరం రూరల్: సమాజ అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. సోమవారం ఆయన రాజమహేంద్రవరంలో ఓఎన్జీసీ అసెట్ కార్యాలయాన్ని సందర్శించారు. తొలుత మంత్రికి ఓఎన్జీసీ అసెట్ మేనేజర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శాంతానుదాస్, హెచ్ఆర్ సీజీఎం రామారావు, అసెట్ సపోర్ట్ మేనేజర్ కేవీకే రాజులు స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గానికి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు కేటాయించి, అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ఈ పనులకు సుమారు రూ.రెండు కోట్లు అవుతుందన్నారు.

### రైతులకు ప్రోత్సాహకరంగా ఉండాలి

రాజమహేంద్రవరం రూరల్: కో–ఆపరేటివ్ సొసైటీలు రైతులకు మరింత ప్రోత్సాహకరంగా ఉండాలని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. సోమవారం గోరంట్ల నివాసంలో నియోజకవర్గంలోని తొమ్మిది సొసైటీల త్రీమెన్ కమిటీ సభ్యులు, సీఈఓలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 22న వేమగిరి, కడియం, మురమండ, కడియపులంక సొసైటీలకు, 23న హుకుంపేట, రాజవోలు, 24న కోలమూరు, కాతేరు, తొర్రేడు సొసైటీలకు ప్రమాణ స్వీకార కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

### కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: చీపురుపల్లికి చెందిన తొర్లపాటి సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త జువ్వల రాజశేఖర్‌పై కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. నిడదవోలుకు చెందిన రాజశేఖర్‌తో 2023లో సంధ్యారాణికి వివాహమైంది. అనంతరం ఆమెను భర్త, అత్తమావలు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

### 90 లీటర్ల సారా స్వాధీనం

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేట ఏటిగట్టుపై 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వీరెల్లి రాముపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామన్నారు.



దుళ్ల - వీరవరం మధ్య రోడ్డుపై భారీ గోతులు



వీరవరం- కడియం మధ్య అధ్వానంగా రహదారి

# విసిగి వేసారి!

- మరమ్మతులు చేసిన ఆరు నెలలకే గుంతలు
- అధ్వాన రోడ్లులో ప్రయాణ గండం
- కడియం– దుళ్ల రోడ్డు దుస్థితి

**కడియం: గొప్పలు చెప్పొద్దు గోతులు పూడ్చండి.. రాళ్లు తేలిన రహదారిలో ప్రయాణ అవస్థలు తీర్చండని** కడియం నుంచి దుళ్ల వెళ్లే ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ రోడ్డుపై గుంతలు పూడ్చిన ఆరు నెలలు తిరగకుండా యథాస్థానానికి చేరడంతో ప్రయాణానికి జనం విసిగి 'వే'సారిపోతున్నారు.. నడిచేందుకే నరకం చూస్తున్నారు.. ఇలా నిత్యం ప్రయాణం దినదిన గండంలా మారిందని ఆందోళన చెందుతున్నారు..

కడియం నుంచి దుళ్ల గ్రామానికి సుమారు తొమ్మిది కిలోమీటర్లు ఉంటుంది. ఈ రహదారి ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తోంది. మండలంలోని దాదాపు ఆరు గ్రామాల నుంచి కడియం వెళ్లేందుకు ఈ రోడ్డే కీలకం. అయితే అడుగుకో గుంత పడడంతో వాహనదారులు నానా పాట్లు పడ్డారు. ఏళ్ల తరబడి నిర్వహణ లేక భారీ గోతులు పడ్డాయి. దీంతో గత ఏడాది డిసెంబర్‌లో మరమ్మతులు ప్రారంభించి రెండు నెలల పాటు సుమారు రూ. 35 లక్షలు వెచ్చించి పనులు పూర్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మతులు చేశామంటూ కూటమి నాయకులు గొప్పగా ప్రచారం చేసుకున్నారు. ఇదంతా జరిగి ఆరు నెలలు దాటకుండానే ఈ రోడ్డు మళ్లీ అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే గుంతలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డులో ప్రయాణం అంటేనే జనం జంకుతున్నారు. ఈ తొమ్మిది కిలోమీటర్ల రోడ్డుపై ప్రయాణించి దుళ్ల నుంచి మండల కేంద్రమైన కడియం చేరుకోవడానికి దాదాపు గంట సమయం పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రమాదకరంగా మారింది. దుళ్ల, వీరవరం, పొట్టిలంక, దామిరెడ్డిపల్లి, కడియపులంక పంచాయతీ పరిధిలోని దోసాలమ్మకాలనీ, కడియపుసారం గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు మీదుగా కడియం గ్రామానికి చేరుకుంటారు. **నెలల వ్యవధిలోనే ఈ రోడ్డు పాడవడంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు.**

**అగి.. చుట్టూ తిరిగి..**

**మండలంలోని ప్రధాన గ్రామాల నుంచి కడియం చేరుకునేందుకే కాకుండా మండపేట, ఏడిద గ్రామాల నుంచి రాజమహేంద్రవరం వెళ్లేందుకు కూడా ఈ రోడ్డునే** వినియోగిస్తుంటారు. అయితే రోడ్డు మొత్తం గతుకుల మయంగా మారిపోవడంతో దుళ్ల నుంచి మడికి మీదుగా హైవేకు చేరుకుని, అక్కడి నుంచి రాజమహేంద్రవరం వెళ్లాల్సి వస్తోంది. ఇలా చుట్టూ తిరిగి ప్రయాణించడంతో దాదాపు ఐదు కిలోమీటర్ల దూరం పెరుగుతోందని ప్రజలు చెబుతున్నారు. దుళ్ల–కడియం రోడ్డు గతుకుల మయం కావడంతో దూరమైనప్పటికీ ఆ రోడ్డునే వినియోగించుకుంటున్నామని చెబుతున్నారు. నిత్యం ఆయా గ్రామాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలతో పాటు, నర్సరీ మొక్కల ఎగుమతులు/దిగుమతులకు వచ్చే వాహనాలతో ఈ రోడ్డు అత్యంత రద్దీగా ఉంటుంది. గంట వ్యవధిలో ఈ రోడ్డు మీదుగా దాదాపు 1,500 వాహనాలు ప్రయాణిస్తున్నట్లు అంచనా. ఈ స్థాయి వాహనాల రద్దీ ఉండే ఈ రోడ్డు మరమ్మతుల గురించి నిర్లక్ష్యం చేయడం తగదని, తక్షణం రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

**నాణ్యత లేకే మళ్లీ మొదటికి..**

రోడ్డుకు మరమ్మతులు చేసిన నెలల వ్యవధిలోనే తిరిగి మామూలుగానే గోతులు పడిపోయాయి. నాణ్యతా లోపం, నిర్వహణ లేకపోవడం వల్లే ఇలా అయ్యింది. వేలాది వాహనాలు ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయినప్పటికీ ఇలా నిర్లక్ష్యంగా వదిలేయడం దారుణం.

– వి.వీరభద్రం, ప్రయాణికుడు

**వాహనాలు పాడవుతున్నాయి..**

భారీగా గోతులు పడడంతో ఈ రోడ్డుపై నుంచి వెళితే వాహనాలు పాడవుతున్నాయి. దీంతో దుళ్ల నుంచి రాజమహేంద్రవరం వెళ్లేందుకు మడికి మీదుగా హైవేకు వెళుతున్నాం. దీనివల్ల సుమారు ఐదు కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. అయినప్పటికీ వాహనాల మెయింటినెన్స్ కారణంగా అలాగే వెళుతున్నాం.

– సూర్యం, ఆటో డ్రైవర్.

## ఏకపక్ష నిర్ణయాలు మానుకోండి



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

- ఫ్లెక్సీల నిషేధం వెనక్కి తీసుకోవాలి
- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడానికి వీల్లేదని నగరపాలక సంస్థ తీసుకున్న ఏకపక్ష నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపట్టడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. సోమవారం స్థానిక ఏపీ పేపర్‌మిల్లు ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ సాయి కల్యాణ మండపంలో రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కన్వీనర్ దేశిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు నగరంలో ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు ఏర్పాటు చేస్తుంటే, అవి తొలగించకుండా సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఫ్లెక్సీలు పెడితే అనుమతి తీసుకోవాలని, జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేయడం సరికాదన్నారు. ఏ కార్యక్రమం చేసుకున్నా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సర్వసాధారణంగా మారిందని, అధికారులు పర్యావరణానికి హాని అంటూ ఏకపక్షంగా నిషేధం విధించడంపై మండిపడ్డారు. నగరంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థలను అందుబాటులోకి తేవడానికి ప్రయత్నం చెయ్యని అధికారులు ఈ విధంగా ఫ్లెక్సీల నిషేధం అంటూ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ నిర్ణయం ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ఉందని, అందరూ రూ.లక్షలు చెల్లించి హోర్డింగులు ఏర్పాటు చేసుకునేందుకు వీలుకాదన్నారు. రోడ్ల కూడళ్లు, ఆలయాలు, ఆసుపత్రుల వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయడానికి వీల్లేదని నిబంధన విధించారని, మరి ఇంకెక్కడ ఏర్పాటు చేసుకోవాలని ప్రశ్నించారు. నగరంలో ఉన్న కాలుష్యం ఎక్కడా ఉండదని, గోదావరి కలుషితంపై ఎన్ని ఉద్యమాలు చేసినా ఏ రాజకీయ పార్టీ నాయకులు, ప్రభుత్వాలు స్పందించిన దాఖలాలు లేవని డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఫ్లెక్సీల నిషేధం నిర్ణయంపై ఇన్‌చార్జ్ కమిషనర్, కలెక్టర్ ప్రశాంతిని కలసి అఖిలపక్షం తరఫున వినతిపత్రం అందజేశారు. తక్షణం ఆమె స్పందించకపోతే వచ్చే రోజుల్లో రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు జేటీ రామారావు, రాష్ట్ర బీసీ నాయకులు కేకే సంజీవరావు, పీసీసీ సభ్యుడు బెజవాడ రంగారావు, ఏపీ పేపర్ మిల్ రిటైర్డ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యుడు ఎస్‌వీవీ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## భవన నిర్మాణ వ్యర్థాలను తరలించండి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: నిబంధనలను అనుసరించి నగర పరిధిలో ఉత్పత్తి అయ్యే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను తరలించడానికి ప్రత్యేక సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్, కలెక్టర్ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. స్థానిక నగరపాలక సంస్థ పరిధిలో ప్రజల వినియోగార్థం నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు సోమవారం ప్రతిపాదించినట్లు తెలిపారు. రూరల్‌లోని హుకుంపేట పంచాయతీ, నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ సమీపంలో పదెకరాల 52 సెంట్ల స్థలంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భవన నిర్మాణ యజమానులు, అనుమతించిన ఉత్పత్తిదారుల నుంచి సేకరించిన నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసేందుకు, తాత్కాలికంగా నిల్వ చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ మేరకు ప్రజలకు, కాంట్రాక్టర్లకు మార్గదర్శకాలు ఇచ్చామన్నారు. భవన నిర్మాణ యజమానులు, బిల్డర్లు, కాంట్రాక్టర్లు తప్పనిసరిగా వ్యర్థాలను సేకరణ కేంద్రాలకు తరలించాలని అన్నారు. రహదారులు, ఖాళీ ప్రదేశాలు, డ్రైనేజీల్లో వ్యర్థాలను వేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తామని అన్నారు. ప్రజా అవసరాలు, పట్టణ పరిధిని బట్టి భవిష్యత్తులో మరిన్ని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా, కాలుష్య రహితంగా ఉండేలా ప్రజలు సహకరించాలని ప్రశాంతి విజ్ఞప్తి చేశారు.

## పునరావాస కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



మున్సిపల్ కల్యాణ మండపాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ కృష్ణనాయక్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండడం, వరదల నేపథ్యంలో లంక గ్రామాల్లో కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ అధికారులకు సూచనలు చేశారు. సోమవారం ఆయన ఆల్కాట్‌తోటలోని పునరావాస కేంద్రమైన మున్సిపల్ కల్యాణ మండపాన్ని సందర్శించి మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు. సహాయక చర్యల్లో భాగంగా రాజమహేంద్రవరం అర్బన్ పరిధిలో ముంపు లంకలైన కేతావారిలంక, వెదుర్లంక, బ్రిడ్జిలంక తదితర ప్రాంతాల్లోని సుమారు 198 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి అనువైన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు, క్షేత్రస్థాయిలో పరిశీలనతో పాటు పునరావాస కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఆర్డీఓ వెంట అర్బన్ తహసీల్దార్ పీహెచ్‌జీఆర్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధికి ఊతం

- ఉపాధి హామీ పథకంలో కొత్త పనులు
- పండ్ల తోటలు, నీటి కుంటలు, కందకాల తవ్వడానికి ప్రాధాన్యం
- ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం



రంగంపేట మండలంలో భూగర్భ జలాల పెంపునకు తవ్విన కందకాలు

రంగంపేట: అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శాశ్వత ఫలసాయం దక్కేలా ప్రత్యేక కార్యచరణ రూపొందించింది. ఇప్పటికే ఉపాధి హామీ పనులకు మంచి ఆదరణ ఉండగా రైతన్నల నుంచి దరఖాస్తులు స్వీకరించి సరికొత్త పనులకు శ్రీకారం చుడుతోంది. పచ్చదనమే ప్రధానంగా ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి క్షేత్ర స్థాయిలో రైతులకు సహాయం అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. అటు రైతులకు, ఇటు వేతనదారులకు నిత్యం లబ్ధి చేకూరేలా పండ్ల తోటల పెంపకం చేపట్టి తద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందించేలా కార్యాచరణ రూపొందించింది. కందకాలు తవ్వడం వలన భూగర్భ జలాలు సైతం పెరగనున్నాయి.

**మొక్కల పెంపకంతో అదనపు ఆదాయం**

పొలాల గట్లపై మొక్కల పెంపకం, చెట్ల చుట్టూ కందకాల (రింగ్ ట్రెంచ్‌లు) తవ్వించడం వంటి పనులకు ఉపాధి పథకం ద్వారా నిధులు చెల్లిస్తున్నారు. ఈ పనుల ద్వారా రైతులకు అటు పొలాల వద్ద చెట్లను సంరక్షించుకునే అవకాశంతో పాటు రూ.17 వేల వరకు వేతనం లభిస్తుంది. మరో వైపు ఈ కందకాలతో చెట్టుకు నీటి సదుపాయం కలుగుతుంది. మూడు ఎకరాలున్న రైతులు తమ మెట్ట ప్రాంత పొలాల్లో నీటి కుంటలు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు రెండు మీటర్ల లోతు తప్పని సరిగా తవ్వాలి. వీటికి రూ.50 వేలు వరకు అందజేస్తారు.



ఉపాధి హామీ పథకంలో తవ్విన ఫారం పాండ్‌లో చేరిన నీరు



జీడిమామిడి తోటలో మొక్కల చుట్టూ రింగ్ ట్రెంచర్లు తవ్వుతున్న వేతనదారులు

**తోటల పెంపకానికి ప్రోత్సహకాలు**

న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతుల తమ పొలాల్లో పండ్ల తోటల పెంపకం చేపడితే ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందజేస్తారు. ఉద్యానవన అధికారులతో 14 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా ఇస్తారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు అందిస్తారు. వీటిని మూడేళ్ల పాటు పెంపకానికి రూ.97 వేలు వరకు ఉపాధి పథకం ద్వారా పనులు అందిస్తారు. మూడేళ్ల అనంతరం ఫలసాయాన్ని రైతులే పొందవచ్చు.


**రైతులకు ఉపయోగం**



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా కొబ్బరి, ఆయిల్‌పామ్ మొక్కల పెంపకానికి ఉపాధి హామీ వేతన దారులతో కందకాలు తవ్వించడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మొక్కల ఎదుగుదలకు మూడేళ్ల పాటు సంరక్షణ కల్పిస్తూ ప్రోత్సాహకాలు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, రంగంపేట మండలం

**పెరగనున్న భూగర్భ జలాలు**



రైతులకు, వేతన దారులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరం. అలాగే భూగర్భ జలాలు పెరగడానికి దోహదపడతాయి. కందకాల తవ్వకానికి నిధులు కేటాయిస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా పండ్ల తోటలు, కొబ్బరి మొక్కల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నాం.

– నాగ శేషవేణి, ఉపాధి ఏపీఓ, రంగంపేట మండలం

### మసీదుపై దాడిని ఖండిస్తున్నాం..



ఎండీ ఆరిఫ్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మతపరమైన శాంతి భద్రతలను కాపాడే విషయంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ మహ్మద్ ఆరిఫ్ అన్నారు. సోమవారం స్థానికంగా తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ త్రిపురాంతకం మండలం, ధూపాడు గ్రామంలోని శతాబ్దం పైబడిన చరిత్ర కలిగిన పాత మసీదు తాళం పగలగొట్టి, దానిని తగులబెట్టిన దారుణ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడిలో మసీదు లోపల ఉన్న ప్రార్థనా పీటలు, పవిత్ర ఖురాన్ గ్రంథాలు, ఏసీలు, ఫ్యాన్లు దగ్ధమయ్యాయన్నారు. ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. సమాజాల మధ్య శాంతికి భంగం కలిగించే కిరాతక ప్రయత్నం ఇదన్నారు. మసీదు పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు అక్కడ జిల్లా ఎస్పీకి ఈ విషయం తెలియజేయగా, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు.

### నర్సరీని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

కడియం: బుర్రిలంకలోని ఉమాపార్వతి నర్సరీని సోమవారం ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సందర్శించారు. నర్సరీ రైతు కొత్తపల్లి మూర్తి ఆయనకు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నర్సరీలోని మొక్కల గురించి ఆయనకు వివరించారు. భారీ వృక్షాలను సంరక్షించేందుకు వారు తీసుకునే జాగ్రత్తలను కేతిరెడ్డికి తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నర్సరీ రైతులు పాల్గొన్నారు.

### రైతుల ఆందోళన

సీతానగరం: యూరియా పూర్తి స్థాయిలో అందించాలని కోరుతూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సీతానగరం, చినకొండేపూడి సహకార సంఘాలకు ఒక లారీలో కేవలం పది టన్నులు యూరియా మాత్రమే వచ్చింది. ఆ యూరియాను రెండు సంఘాలు పంచుకుని రైతులకు అందించడానికి సిద్ధం చేశారు. రైతులు ఆధార్ కార్డు చూపితే ఒక బస్తా యూరియా ఇస్తున్నారు. పది ఎకరాలు కౌలుకు చేసే కౌలు రైతులకు ఒక బస్తా యూరియా ఏం సరిపోతుంది. ఒక బస్తాతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. కొరత లేదని వ్యవసాయశాఖాధికారులు రైతులను మభ్యపెడుతున్నారని, పలు పంటలకు ఎరువులు అత్యవసరమని, ఎప్పుడు లేని కొరత ఇప్పుడు చూపిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు

### ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

రంగంపేట: ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో స్వాధీన పరచుకొన్న మూడు ద్విచక్ర వాహనాలను ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

### నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపు

సీతానగరం: బొబ్బిల్లంక సచివాలయ–1లో మంగళవారం నుంచి ఆధార్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ స్పెషల్ క్యాంపు ఈనెల 23వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. 5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల వయస్సు గల పిల్లలకు మాత్రమే ఈ స్పెషల్ క్యాంపు జరుగుతుందని, ఆధార్ కార్డులో తప్పులు ఉన్నా, అడ్రస్సులు మార్పు వంటి పలు అంశాల మార్పుల కోసం స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

## సినిమాలు



| | |
|---|---|
| శ్యామల | వార్–2 |
| సూర్యమినీ | మహావతార్ నరసింహ, |
| సూర్యప్యాలెస్ | వార్–2 |
| స్వామి | కూలీ |
| అనుశ్రీ | కూలీ |
| శివజ్యోతి | కూలీ |
| రాజా | వార్–2 |
| ఊర్వశి | కూలీ |
| మేనక | మహావతార్ నరసింహ |
| రంభ | వార్–2 |
| అప్సర | వార్–2 |
| అశోక | వార్–2 |
| **నామవరం** | |
| దీఎస్ మహల్ | కూలీ, వార్–2 |
| **ధవళేశ్వరం** | |
| మురళీకృష్ణ | కూలీ, వార్–2 |
| **కడియం** | |
| వెంకటసూర్య | కూలీ, వార్–2 |